

బాపూజీకి గవర్నర్ నివాళి



గాంధేయవాదులకు గవర్నర్ ఆర్ఎన్ రవి సత్కారం

బాపూజీకి నివాళి

● ఘనంగా 156 జయంతి వేడుకలు



బాపూజీకి టీఎంసీ అధినేత జీకే వాసన్ నివాళి

అడయార్, అక్టోబరు 2: జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు బుధవారం ఘన నివాళులు అర్పించారు. గిండిలోని గాంధీ మండపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గవర్నర్ ఆర్.ఎన్. రవి గాంధీ మండపంలోని జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్‌తో పాటు బీజేపీకి చెందిన ముఖ్య నేతలున్నారు. అదేవిధంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని సమాజ సేవలో పాల్గొంటూ, శాంతిభద్రతల కోసం కృషి చేస్తున్న ఏడుగురు గాంధేయవాదులను రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ సత్కరించారు.



తిరుచెందూర్‌లో ..



ఈరోడ్ జిల్లా భవానీ ఘాట్ వద్ద తర్పణాలు



రామేశ్వరం అగ్నితీర్థం వద్ద పితృదేవతలకు తర్పణాలిచ్చేందుకు వచ్చిన భక్తులు

పెద్దల స్మరణ

● భక్తిశ్రద్ధలతో మహాలయ అమావాస్య
● ఆలయాలకు పోటెత్తిన భక్తులు
● పితృదేవతలకు తర్పణాలు

పెరంబూర్, అక్టోబరు 2: మహాలయ అమావాస్య సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రజలు తమ పితృదేవతలకు తర్పణాలు ఇచ్చారు. రామేశ్వరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం పర్వతవర్థని సమేత రామనాథస్వామివారి ఆలయం సమీపంలోని అగ్నితీర్థం (సముద్రతీరం)లో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేసి తమ పితృదేవతలకు తర్పణాలు విడిచారు. వేకువజామున 5 గంటల నుంచే రామేశ్వరం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహాలయ అమావాస్య రోజున పితృదేవతలకు తర్పణాలిస్తే మంచిదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో వివిధ నగరాల నుంచి సముద్రతీర ప్రాంతాలకు మంగళవారం రాత్రికే భక్తులు చేరుకున్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం వేకువజామున రామనాథస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలను తిలకించిన భక్తులందరూ అగ్నితీర్థంలో పితృదేవతలకు తర్పణాలు విడిచారు. దీంతో సముద్రతీరమంతా తర్పణాలిచ్చేందుకు వచ్చిన భక్తులతో నిండిపోయింది. ఆలయ ప్రాంతంలోని 22 తీర్థాల్లో స్నానమాచరించిన భక్తులు పర్వతవర్థిని సమేత రామనాథస్వామివారిని దర్శించారు. రామేశ్వరాలయానికివచ్చే భక్తులు చెన్నై, మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, బెంగళూరు తదితర నగరాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు కూడా నడిపారు. రామనాథపురం జిల్లాలోని సేతుక్కరై, దేవీపట్టినం సముద్రతీర ప్రాంతాల్లో భక్తులు తర్పణాలు సమర్పించారు.

త్రివేణి సంగమంలో...

సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద బుధవారం వేకువనే భక్తులు పుణ్యస్నానాలు చేసి పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఆ సందర్భంగా ఓదువార్లు (పరమశివుడి కీర్తన చేసేవారు) శ్రావ్యంగా భక్తిగీతాలను ఆలాపించారు. ఆ తర్వాత భక్తులంతా కన్నియాకుమారిలోని గణపతి, భగవతి అమ్మవారు, కాశీ విశ్వనాథస్వామి, కాశీ విశాలాక్షి తదితర ఆలయాల్లో దైవదర్శనం చేసుకున్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భగవతి అమ్మవారి ఆలయంలో ఉదయం 11 గంటలకు అమ్మవారికి వజ్ర కిరీటం, వజ్రాలు పొదిగిన ముక్కుపుడక ధరింపజేశారు. 11.30 గంటలకు అలంకార దీపారాధన నిర్వహించారు.

కంచి, తిరువళ్లూరులో...

మహాలయ అమావాస్య సందర్భంగా కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లోని ఆలయాల్లో తీర్థ కొలనుల వద్ద పితృదేవతలకు తర్పణాలు వదిలేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. తిరువళ్లూరులోని వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయ తీర్థం వద్ద వేల సంఖ్యలో భక్తులు పురోహితుల మంత్రోచ్చారణ నడుమ పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి దర్శనానికి సుమారు మూడు గంటలు పట్టింది. ఇదే రీతిలో కాంచీపురంలోని సాత్తాల్ ఈశ్వరాలయం, అత్తివరదాలయం తదితర ఆలయాల వద్ద కూడా భక్తులు పితృదేవతలకు తర్పణాలు పెట్టారు. పొన్నేరి, కృష్ణాపురం, మెదూరు, పళవేర్కాడు, పెరియమనోపురం, ఆలాడు పరిసర ప్రాంతాల వద్ద కూడా భక్తులు చెరువుల సమీపాల్లో పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఇదే విధంగా తిరుచ్చి సమీపంలోని కావేరి నదీ తీర ప్రాంతం అమ్మామండపం వద్ద కూడా వేల సంఖ్యలో భక్తులు పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు.




నామక్కల్‌లో...

ఖాదీ వాడండి

ప్రజలకు సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖాదీ వస్త్రాల వినియోగాన్ని పెంచాలని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. బుధవారం ఎగ్మూర్ మ్యూజియంలో వున్న గాంధీ విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో ఖాదీ బోర్డు పురోభివృద్ధికి, చేనేత కార్మికులు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రతి ఒక్కరూ ఖద్దరు దుస్తులను ధరించాలని మహాత్మా గాంధీ పిలుపునిచ్చారని, గాంధీజీ పిలుపును ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో ఖాదీ పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అతి తక్కువ ధరలకు ఖద్దరు దుస్తులు ఇవ్వాలనే లక్ష్యంతో యేడాది పొడవునా 30 శాతం రాయితీతో ఈ వస్త్రాలను విక్రయిస్తున్నామన్నారు. మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని దేశ సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఖద్దరు ఉత్పత్తులు, ఖాదీ గ్రామోద్యోగ్ బోర్డు తయారు చేసే ఉత్పత్తులను విద్యార్థినీ విద్యార్థులతో పాటు యువత, ఉద్యోగులు, ప్రజలు కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, రాష్ట్ర మంత్రులు స్వామినాథన్, రాజకన్నప్పన్, సుబ్రహ్మణ్యం, పీకే శేఖర్‌బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, దక్షిణ చెన్నై ఎంపీ తమిళిచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు పరంధామన్, ప్రభాకర్ రాజా, జోసెఫ్ సామువేల్, మయిలై వేలు, మాజీ ఎమ్మెల్యే పా.రంగనాథన్, సమాచార ప్రసార శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని గాంధీజీకి నివాళులు అర్పించారు.



బాపూజీకి స్టాలిన్ బృందం నివాళి

శాంతి దూత

●అమరజీవి స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



కమిటీ నిర్వాహకులతో విజేతలు

ప్యారీస్, అక్టోబరు 2: ఆయుధాలు లేకుండా శాంతియుతంగా పోరాడి అహింసా మార్గాన్ని జాతికి అందించిన మహనీయుడు బాపూజీ అని పలువురు వక్తలు కొనియాడారు. మైలాపూర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్‌రెడ్డి సారథ్యం వహించగా, సభ్యుడు ఎంవీ నారాయణ గుప్తా స్వాగతం పలికారు. టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య 'భారత దేశ పునర్నిర్మాణం జాతిపిత పాత్ర' అనే అంశంపై ప్రసంగిస్తూ... రాజుల కాలంలో శత్రు దేశంపై ఆయుధాలతో యుద్ధం చేసేవారని, అయితే ఎలాంటి ఆయుధాలు లేకుండా మహాత్మా గాంధీ ఓర్పు, శాంతి, అహింసా అనే ఆయుధాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రముఖ గాయకులు ఎమ్మార్ సుబ్రమణ్యం, ఎం.రవికుమార్, అరుణా శ్రీనాథ్ తెలుగు సినిమాల్లోని జాతీయ గీతాలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన నగరంలోని ఐదు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బహుమతి, నగదు, ప్రశంసా పత్రాలు అలాగే, తెలుగు టీచర్లకు, గాయకులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కమిటీ కార్యదర్శి, కోశాధికారి ఒంటెల కృష్ణారావు, సభ్యులు డా.విస్తాలి శంకరరావు, జెఎం నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య, డా.ఏవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గుడిమెట్ల చెన్నయ్య వందన సమర్పణతో ముగిసింది.

ఎస్ఎస్ఏ సిబ్బందికి జీతాల్లేవ్!

● పీఎంకే అధినేత రాందాస్

చెన్నై, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఒక భాగమైన 'సమగ్ర శిక్ష అభియాన్ పథకం'లో పనిచేసే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సెప్టెంబరు నెల జీతం అందలేదు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద 15 వేల మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, 17500 మంది కాంట్రాక్ట్ సిబ్బంది కలిపి మొత్తం 32,500 మంది కి సెప్టెంబరు నెల వేతనం అందకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.573 కోట్లను కేంద్రం విడుదల చేయపోవడమే ఈ జాప్యానికి కారణమని ప్రభుత్వ పెద్దలు చెబుతుండగా, ఈ వ్యవహారం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదిలా వుండగా ఈ వ్యవహారాన్ని పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్ తీవ్రంగా ఖండించారు. ఉద్యోగులకు కూడా జీతాలివ్వకపోవడమంటే ఆ ప్రభుత్వ తీరేంటో తెలిసిపోతుందని ఆయన కటువుగా వ్యాఖ్యానించారు. దీనిపై రాందాస్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.573 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయపోవడమే ఈ జాప్యానికి కారణమని రాష్ట్ర ప్రభుత్వాధికారులు చెబుతున్నారని, ఇలా నిధులు ఉద్దేశ్యపూర్వకంగా విడుదల చేయకపోవడం సమంజసం కాదన్నారు. అదేసమయంలో కేంద్రం నిధులు ఇవ్వలేదన్న సాకుతో ఈ పథకంలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే ఈ వేతనాలు చెల్లించడంలో పెద్ద విషయమేమీ కాదన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగులు కుటుంబ పోషణకు జీతం పైనే ఆధారపడి ఉంటారని, అందువల్ల ప్రభుత్వం తక్షణం నిధులను కేటాయించి వేతనాలు మంజూరు చేయాలని డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు.

మద్యంపై ఉద్యమం

● నిషేధంపై కాలపట్టిక విడుదల చేయాల్సిందే
● డీపీఐ మాదకద్రవ్యాల నిర్మూలన మహిళా మహానాడు డిమాండ్



సభలో ప్రసంగిస్తున్న తిరుమావళవన్



హాజరైన ప్రజానీకం

ప్యారీస్, అక్టోబరు 2: రాష్ట్రంలో విడతల వారీగా చేపట్టదలచిన మద్యనిషేధానికి సంబంధించిన కాలపట్టికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ) మహిళా విభాగం డిమాండ్ చేసింది. డీపీఐ మహిళా విభాగం ఆధ్వర్యంలో కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేటలో బుధవారం సాయంత్రం మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలన మహానాడు జరిగింది. ఇందులో ఏకగ్రీవంగా ఆమోదించిన 13 తీర్మానాల్లోని కీలక అంశాలపై డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ ప్రసంగించారు. మద్యం విక్రయాలు రాజ్యాంగానికి విరుద్ధమని, జాతీయ స్థాయిలో సంపూర్ణ మద్యనిషేధ చట్టం రూపొందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యనిషేధ చట్టం అమలు చేస్తున్న రాష్ట్రాలకు అదనపు నిధులు మంజూరు చేయాలని, కేంద్రం వసూలు చేసే జీఎస్టీ మద్యానికి బానిసలై యుక్తవయస్సులోనే మరణించిన వారి కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో విడతల వారీగా మూసివేయాలనుకుంటున్న టాస్మాక్ దుకాణాల పట్టిక ప్రభుత్వం విడుదల చేయాలని, ఆ తర్వాత సంపూర్ణ మద్యనిషేధ చట్టం కోసం అసెంబ్లీలో తీర్మానం నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో ఏడాదికి ఏడాది మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, గ్రామాల్లో ఈ విక్రయాలను అడ్డుకోవాలన్నారు. మత్తుకు బానిసలైన విద్యార్థులను ఆ సమస్య నుంచి విడిపించేలా మహిళా స్వయం సహాయక బృందాలతో అవగాహన ప్రచారం చేపట్టాలని కోరారు. ప్రభుత్వాసుపత్రుల్లో మద్యానికి బానిసలైన వారి కోసం పునరావాస విభాగాలను ఏర్పాటుచేయాలన్నారు. మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎన్జీఓ, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంగా ప్రచారం చేయాలని కోరారు. అయ్యా వైకుంఠర్ జయంతి రోజున టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించాలని తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఈ మహానాడులో డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి, ప్రచారకర్త టీకేఎస్ ఇళంగోవన్, అయ్యా వైకుంఠర్ ట్రస్టీ చైర్మెన్ బాల ప్రజాపతి అడిగళార్, ఎమ్మెల్యే సింతనై సెల్వన్, ఎంపీ రవికుమార్, సీపీఎం అనుబంధ మహిళా విభాగం జాతీయ కార్యదర్శి వాసుకి, సీపీఐ ప్రధాన కార్యదర్శి ఆణి రాజా, కాంగ్రెస్ ఎంపీ సుధ సహా డీపీఐ రాష్ట్ర, జిల్లా, స్థాయి నిర్వాహకులు, మహిళా విభాగం కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న అశేష భక్తజనం

తిరుమల గొడుగుల ఊరేగింపు

ప్యారీస్, అక్టోబరు 2: ప్యారీస్‌లోని చెన్నకేశవ పెరుమాళ్ ఆలయంలో తిరుమల గొడుగుల ఊరేగింపును తిరుకంకుడి జీయర్ రామానుజ స్వామి బుధవారం ప్రారంభించారు. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరానికి చెందిన హిందూ ధర్మార్థ సమితి ప్రతి ఏటా శ్రీవారికి గొడుగులు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సమితి ఆధ్వర్యంలో ఉదయం 10.20 గంటలకు గొగుగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవంలో హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్, నిర్వాహక ధర్మకర్త ఎస్.వేదాంతం, విశ్వ హిందూ పరిషత్ విద్యా కేంద్రం ప్రధాన కార్యదర్శి గిరిజా శేషాద్రి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సోమసుందరం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు గొడుగుల ఊరేగింపు నేతాజీ సుభాష్ చంద్రబోస్ రోడ్డు, గోవిందప్ప నాయకన్ వీధి, భైరాగి మఠం, వాల్టాక్స్ రోడ్డు మీదుగా సాయంత్రం 4 గంటలకు అశేష భక్తజనం మధ్య ఎలిఫెంట్ గేట్ చేరుకుంది. అక్కడి నుంచి చూళై హైరోడ్డు, అవధానం పాపయ్య రోడ్డు, వడమలై వీధి, తానా వీధి, చెల్లప్ప వీధుల మీదుగా రాత్రి అయనావరంలోని కాశి విశ్వనాథ ఆలయం చేరుకుంది. గురువారం విల్లివాక్కం, తిరుముల్లైవాయల్, తిరువళ్లూర్ మీదుగా సాగే ఊరేగింపు ఈ నెల 7వ తేది తిరుమలకు చేరుకుంటుంది. తిరుమల మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లే గొడుగులను తిరుపతి జీయర్ స్వామి సమక్షంలో టీటీడీ అధికారులకు అప్పగించనున్నట్లు ఆర్ఆర్ గోపాల్ తెలిపారు.



గొడుగుల ఊరేగింపు ప్రారంభోత్సవంలో తిరుకంకుడి జీయర్ స్వామి, ఆర్ఆర్ గోపాల్ తదితరులు

సమాచార దర్శిని

కొడైకెనాల్‌లో సందర్శనకు అనుమతి

ఐసిఎఫ్, అక్టోబరు 2: దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో అటవీ శాఖ ఆధీనంలో ఉన్న పర్యాటకు ప్రాంతాలకు బుధవారం నుంచి పర్యాటకులను అనుమతించారు. మేయర్ స్క్వేయర్, గుణ గుహలు, పైన్ ఫారెస్ట్, పిల్లర్ రాక్ తదితర ప్రాంతాలకు పర్యాటకులు ఉచితంగా వెళ్లవచ్చని అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

ఉచితంగా పేరు మార్పు, సవరణలు

ఐసిఎఫ్, అక్టోబరు 2: వాటర్ బోర్డు వినియోగదారులు ఉచితంగా పేరు మార్పు, సవరణలు చేసుకోవచ్చని చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై మెట్రోవాటర్ బోర్డు పరిధిలో 13.85 లక్షల మందికి తాగు, మురుగునీటి కనెక్షన్లున్నాయి. ఈ కనెక్షన్లున్న వారు పేరు, ఇతర సవరణలు చేపట్టేందుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, మంగళవారం నుంచి ఈ సేవలు ఉచితంగా అందజేయనున్నామని అధికారులు తెలిపారు. తగిన సర్టిఫికెట్లతో ఆన్‌లైన్, మెట్రోవాటర్ బోర్డు శాఖా కార్యాలయాలను సంప్రదించి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో రిజర్వేషన్... 13 మందికి బహుమతులు

ఐసిఎఫ్, అక్టోబరు 2: ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొని ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించిన 13 మందికి నగదు బహుమతి అందజేయనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తెలిపింది. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో TNSTC అనే యాప్, www.tnstc.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే సదుపాయం కల్పించారు. దీని ప్రకారం, వారాంతపు, సెలవు రోజులు మినహా ఇతర రోజుల్లో రిజర్వేషన్ చేసుకొనేలా ప్రోత్సహించేందుకు కంప్యూటర్ లాటరీ ద్వారా ప్రయాణికులను ఎంపిక చేసి నగదు బహుమతి అందిస్తున్నారు. ఆ ప్రకారం సెప్టెంబరులో ప్రయాణించిన ముగ్గురికి తలా రూ.10,000, మరో 10 మందికి తలా రూ.2,000 నగదు అందిచనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, అక్టోబరు 2: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం-పుదుతాంగళ్: ముల్లైనగర్, టీఎస్‌హెచ్‌బీ, స్టేట్ బ్యాంక్ కాలని, ముడియార్ రోడ్డు, ఓల్డ్ తాంబరం, పటేల్ నగర్, ఇరుంబులియూర్, వైగై నగర్, సాయి నగర్, టీటీకే నగర్, కృష్ణా నగర్, శక్తి నగర్, కన్నడపాళయం, కిష్కింద రోడ్డు, రెడ్డియార్ పాళయం, కల్యాణ్ నగర్, మేలండై వీధి, భారతి నగర్, జయరామ్ నగర్, టీచర్స్ కాలని, కన్నన్ అవెన్యూ, కురింజినగర్ కొంత భాగం, అముదం నగర్ కొంత భాగం. **న్యూ కొళత్తూర్:** పూంపుహార్ నగర్, కేసీ గార్డన్, సాయి నగర్, కంభర్ నగర్, తెన్‌పళని నగర్, వీనస్ నగర్, జయరాం నగర్, టీచర్స్ కాలని, రామమూర్తి కాలని, అంజుగం నగర్.

కుమరన్‌చావిడి: పెరియార్ నగర్, వీజీఎన్ అవె న్యూ, జీవన్ ప్రకాష్ నగర్, తులసి నగర్, అభిరామి న గర్, తంగవేల్ నగర్, రేడియన్ ప్లాట్స్, పూందమల్లి హై రోడ్డు, అష్టలక్ష్మి నగర్, వీఎన్‌టీ నగర్, అబ్దుల్ కలాం నగర్, శక్తి గార్డన్, సింధు నగర్, పల్లికుప్పం రోడ్డు.

790 వారాంతపు ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, అక్టోబరు 2: వారాంతపు సెలవులను పురస్కరించుకొని ప్రజల సౌకర్యార్థం 790 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తెలియజేసింది. కిలంబాక్కం బస్ స్టేషన్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 4న 260, 5న 260 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ స్టేషన్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు 4,5 తేదీల్లో తలా 55 బస్సులు, మాధవరం బస్ స్టేషన్ నుంచి 4,5 తేదీల్లో తలా 15 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ సహా ప్రధాన నగరాల నుంచి 200 ప్రత్యేక బస్సులు నడుపున్నామని, ఊర్లకు వెళ్లిన వారు తిరిగొచ్చేలా ఆదివారం కూడా ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.400 పెరిగిన బంగారం

ఐసిఎఫ్, అక్టోబరు 2: నగరంలో బంగారు ఆభరణాల ధరలు బుధవారం రూ.57,000 పెరిగింది. గత వారంలో బంగారం ధరలు క్రమేణా పెరిగి సవర రూ.56,800లకు విక్రయమైంది. ఈ వారం ప్రారంభం నుంచే ధరలు కాస్త తగ్గుముఖం పట్టి మంగళవారం రూ.56,400లకు చేరాయి. ఈ క్రమంలో, బుధవారం 22 క్యారట్ల బంగారం ధర సవరకు రూ.400 పెరిగి రూ.56,800, గ్రాము రూ.7,100కు విక్రయమయ్యాయి. అలాగే, 24 క్యారట్ల బంగారం కూడా రూ.400 పెరిగి రూ.60,440, గ్రాము రూ.7,555లుగా ఉంది. ఇక, వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేకుండా గ్రాము రూ.101, కిలో వెండి కడ్డీలు రూ.1,01,000కు విక్రయమయ్యాయి.

గుమ్మిడిపూండి మార్గంలో రైళ్ల సేవలకు అంతరాయం

పెరంబూర్, అక్టోబరు 2: తిరువళ్లూర్ జిల్లా మీంజూరు రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సు రైలులో బోగీలను అనుసంధానించే ఇనుప కొక్కి ఊడిపోవడంతో బుధవారం ఉదయం ఆ మార్గంలో రైళ్ల సేవలకు అంతరాయం కలిగింది. ఈ ఘటన కారణంగా గుమ్మిడిపూండి నుంచి చెన్నై వైపు వెళ్లే సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేపట్టడంతో సుమారు గంటన్నర ఆలస్యంగా రైళ్ల సేవలు ప్రారంభమయ్యాయి.

వెల్లుల్లి కిలో రూ.350

ఐసిఎఫ్, అక్టోబరు 2: దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లి ధరలు పెరిగాయి. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని దిండుగల్‌లో కొండ వెల్లుల్లి సాగు చేస్తుంటారు. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలైలో సాగు ప్రారంభించి సెప్టెంబరులో కోత చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో, ఆయా రాష్ట్రాల్లో వర్షాలు, నీటి కొరత కారణంగా వెల్లుల్లి దిగుబడులు తగ్గాయి. దీంతో కోయంబేడు మార్కెట్‌కు వెల్లుల్లి దిగుమతి తగ్గడంతో మొదటి రకం వెల్లుల్లి కిలో రూ.350, రెండో రకం రూ.300, మూడవ రకం కిలో రూ.260కి విక్రమవుతోంది. త్వరలో విజయదశమి, దీపావళి పండుగలు రానున్న నేపథ్యంలో, వీటి ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పాదయాత్రకు అనుమతి నిరాకరణ


కాంగ్రెస్ నేతల పాదయాత్ర దృశ్యం

అడయార్, అక్టోబరు 2: మహాత్మా గాంధీ 156 జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ తలపెట్టిన పాదయాత్రలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో పలు ప్రాంతాల్లో పోలీసులతో కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగారు. దేశంలో బీజేపీ మతోన్మాద రాజకీయాలు, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పిలుపునిచ్చారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు బుధవారం రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఆ పాదయాత్రలకు పోలీసులు అనుమతివ్వలేదు. చెన్నై నగరంలో జింఖానా క్లబ్, కామరాజర్ విగ్రహం నుంచి పాదయాత్ర చేపట్టేందుకు ఉదయం 7 గంటలకే కాంగ్రెస్ నేతలంతా తరలివచ్చారు. అయితే అనుమతి లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు పాదయాత్ర చేయడానికి వీల్లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు పోలీసు ఉన్నతాధికారుల జోక్యంతో కామరాజర్ విగ్రహం, మే డే పార్కు, చింతాద్రిపేట, పుదుపేట, లాన్స్ గార్డెన్, ఎగ్మోర్ మ్యూజియం వరకు కాంగ్రెస్ నేతలు పాదయాత్ర చేశారు. ఇందులో పలువురు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. అయితే, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఈ పాదయాత్రకు పోలీసులు అనుమతివ్వలేదు.

8న పీఎంకే ఆధ్వర్యంలో శ్రీలంక దౌత్య కార్యాలయ ముట్టడి

ఐసిఎఫ్, అక్టోబరు 2: రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులను నిరసిస్తూ ఈ నెల 8న నగరంలోని ఆ దేశ దౌత్య కార్యాలయం ముట్టడించనున్నట్లు పీఎంకే ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు డా.అన్బుమణి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర జాలర్లపై లంక నావికాదళ దాడులు రోజురోజుకు అధికమవుతున్నాయన్నారు. ప్రస్తుతం శ్రీలంక జైళ్లలో ఉన్న 163 మంది జాలర్లు, స్వాధీనం చేసుకున్న 192 బోట్లు విడిపించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ఈ ఆందోళనలో పార్టీ నేతలు, అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొనాలని అన్బుమణి పిలుపునిచ్చారు.

ఆస్తిపన్ను పెంపుపై అన్నాడీఎంకే ...

డీఎంకే ప్రభుత్వం ఆస్తి పన్ను పెంపు తక్షణం ఉపసంహరించుకోవాలని ఈ నెల 8న అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మానవహారంతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో, కార్పొరేషన్లు, మున్సిపాలిటీ కార్యాలయాల ముందు చేపట్టనున్న ఈ ప్రదర్శనలో నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని, ఆస్తి పన్ను పెంపుపై తమ నిరసన వ్యక్తం చేయాలని పళనిస్వామి పిలుపునిచ్చారు.

ఈ-గవర్నెన్స్ ఏజెన్సీల ద్వారా ప్రొఫెసర్ల వివరాలు

ఐసిఎఫ్, అక్టోబరు 2: ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ సేవలు వినియోగించి కళాశాల ప్రొఫెసర్ల వివరాలు ధృవీకరించనున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అన్నా వర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో నకిలీ ప్రొఫెసర్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ సమస్య అధికమించేలా, కళాశాల ప్రొఫెసర్లు సహా అన్ని వివరాలు తనిఖీ, పరిశీలించడం తదితరాలకు కొత్త వెబ్‌సైట్ ప్రారంభించనున్నట్లు వర్సిటీ ప్రకటించింది. తమిళనాడు ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ సేవలను ఉపయోగించి వెబ్‌సైట్ ద్వారా ప్రొఫెసర్ల ఆధార్ నెంబరు ధృవీకరించడం జరుగుతుందని వర్శిటీ తెలియజేసింది.

ఉడుమలై అటవీ ప్రాంతంలో గంజాయి సాగు

పెరంబూర్, అక్టోబరు 2: ఉడుమలై అటవీ ప్రాంతంలో గంజాయి సాగు గుర్తించిన అటవీ సిబ్బంది ఆ మొక్కలను దహనం చేశారు. తిరుప్పూర్ జిల్లా ఆనైమలై పులుల సంరక్షణాలయం అటవీ రేంజ్ పరిధిలోని కులిపట్టి, గురుమలై, చోళవందాన్ కొండ ప్రాంతాల్లో గంజాయి సాగుచేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. రేంజర్ జయశీలన్ నేతృత్వంలో సిబ్బంది ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా గంజాయి మొక్కలు కనిపించాయి. 4,5 నెలల్లో పెరిగే ఈ మొక్కలు, మరో నెలలో కోతకు సిద్ధంగా ఉన్నాయని గుర్తించి, వేళ్లతో సహా మొక్కలు దహనం చేసినట్లు రేంజర్ జయశీలన్ తెలిపారు.

ఘనంగా జనసేవా ట్రస్ట్ 8వ వార్షికోత్సవం


గోపూజలో నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 2: జనసేవా ట్రస్ట్ 8వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కోట రౌండ్ రానాలో ఉన్న గోశాలలో జైన్ గురుపూజ చేసి పశువుల భద్రత గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ జైన్, భగవాన్ మహావీర్ జనసేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో మెరుగైన వసతులు

● మంత్రి రాజేంద్రన్

ప్యారీస్, అక్టోబరు 2: రాష్ట్రంలోని ప్రసిద్ధిచెందిన పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల సంక్షేమార్థం వసతులు మెరుగుపరుస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ పేర్కొన్నారు. నగరంలోని పర్యాటక అభివృద్ధి శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి రాజేంద్రన్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చంద్రమోహన్, కమిషనర్ సమయమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి రాజేంద్రన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పలు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. 2030వ సంవత్సరంలోపు ఒక ట్రిలియన్ డాలర్ అన్న లక్ష్యాన్ని చేరుకొనేలా పర్యాటక శాఖ కృషిచేస్తోందని, దీనికి శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు తమ వంతు సహకారం అందజేయాలని మంత్రి కోరారు.

దక్షిణ రైల్వేలో గాంధీ జయంతి వేడుకలు


జాతిపిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏజీఎం కౌశల్ కిషోర్

పెరంబూర్, అక్టోబరు 2: దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలు నిర్వహించారు. డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దక్షిణ రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ కౌశల్ కిషోర్, డీఆర్ఎం బి.విశ్వనాథ్ ఈర్య, అడిషినల్ డివిజినల్ రైల్వే మేనేజర్లు అంకుర్ చౌహాన్, తేజ్ ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొని, గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగి ఎంపి శంకరలింగం పది నిముషాల్లో గాంధీ చిత్రపటం గీసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

14 మంది ఐఏఎస్‌ల బదిలీ

● డిప్యూటీ సీఎం కార్యదర్శిగా ప్రదీప్ యాదవ్

పెరంబూర్, అక్టోబరు 2: రాష్ట్రంలో 14 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఉన్నత విద్యాశాఖ, రహదారుల శాఖ కార్యదర్శి తదితర ముఖ్య బాధ్యతలు వ్యవహరించిన ప్రదీప్ యాదవ్ ఉప ముఖ్యమంత్రి కార్యదర్శిగా నియామకం.
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహుకు అదనంగా పశుసంవర్థక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.
- అదనపు ప్రధాన కార్యదర్శి గోపాల్ ఉన్నత విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా నియామకం
- తమిళనాడు విద్యుత్ శాఖ అధ్యక్షుడిగా వ్యవహరించిన రాజేష్ లఖానీ రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా నియామకం.
- ఉపాధి కల్పన, శిక్షణా శాఖ కమిషనర్ సుందరవల్లి కళాశాల విద్యశాఖ కమిషనర్‌గా నియామకం.
- ఉపాధి అవకాశాల శాఖ డైరెక్టర్‌గా ప్రజాపనుల శాఖ జాయింట్ సెక్రటరీ విష్ణుచంద్రన్ నియామకం.
- చేనేత, జౌళి శాఖ కార్యదర్శిగా సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ అముదవల్లి నియామకం
- సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌గా రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి లిలీ
- జౌళి శాఖ డైరెక్టర్‌గా చెన్నై కార్పొరేషన్ అదనపు కమిషనర్ లలిత .
- పబ్లిక్ సెక్టార్ డిప్యూటీ సెక్రటరీగా తిరుప్పూర్ కార్పొరేషన్ కమిషనర్ పవన్‌కుమార్ నియామకం.
- తమిళనాడు విద్యుత్ బోర్డు చైర్మెన్‌గా నందకుమార్ .
- తమిళనాడు చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్ యాదవ్ .
- ప్రాజెక్ట్ స్టేడ్ డైరెక్టర్‌గా తమిళనాడు చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు స్వర్ణ రూపా .
- ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ ప్రదీప్‌రాజ్ చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియామకం.
- గతంలో ఎక్సైజ్ కమిషనర్‌గా పనిచేసిన జయకాంతన్‌ను తమిళనాడు వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు.

మేట్టుపాళయం-ఊటీ కొండ రైలు ప్రారంభం



పెరంబూర్, అక్టోబరు 2: మేట్టుపాళయం-ఊటీ కొండ రైలు సేవలు రెండు రోజుల అనంతరం మంగళవారం ప్రారంభమయ్యాయి. నీలగిరి జిల్లా ఊటీని సందర్శించే పర్యాటకులు మేట్టుపాళయం-ఊటీ మధ్య నడిచే కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కల్లార్-ఆర్డీలీ మధ్య కొండ రైలు మార్గంపై మట్టిచెరియలు విరిగిపడడంతో, రైలు సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. రైల్వే కార్మికులు పట్టాలపై పడిన మట్టిచెరియలు తొలగించడంతో మంగళవారం నుంచి కొండ రైలు సేవలు యధావిధిగా ప్రారంభమయ్యాయి.

గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్


గ్రామస్తులు, అధికారులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 2: వెంకటాపురం పంచాయతీలో జరిగిన గ్రామసభలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వెంకటాపురం పంచాయతీలో జరిగిన గ్రామసభకు కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే కార్తికేయన్, వేలూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు అముద జ్ఞానశేఖరన్, రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, ప్రత్యేక ఉప కలెక్టర్ (శిక్షణ) రాజ్, పంచాయతి మండ్రం అధ్యక్షుడు బాబు, ఉపాధ్యక్షుడు పార్తీపన్, తహసీల్దార్ మురళి, బీడీఓ విన్సెంట్ బాబు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులచే కలెక్టర్ హింస నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు.

పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంగైకరసన్

వేలూరు, అక్టోబరు 2: గుడియాత్తం 18వ వార్డు అంబాపురం ప్రాంతంలో జరుగుతున్న కాలువ పూడికతీ పనులను మున్సిపల్ కమిషనర్ మంగైకరసన్ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలోని కాలువల్లో దోమల ఉత్పత్తి అధికంగా ఉం దని ఆ ప్రాంత ప్రజలు మున్సిపాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, ఈ ప్రాంతంలోని కాలువల్లో రెండు రోజులుగా పూడికతీత పనులు చేపట్టారు.

తిరుమల పాదయాత్ర భక్తులకు అన్నదానం


ప్రత్యేక అలంకరణలో పద్మావతి సమేత వెంకటేశ్వర పెరుమాళ్

వేలూరు, అక్టోబరు 2: స్థానిక కాట్పాడి కల్పుదూర్‌లో ఉన్న తిరుమల తిరుపతి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో పదేళ్లుగా తిరుమల పాదయాత్ర భక్తులకు అన్నదానం అందిస్తున్నారు. నెలరోజులు జరిగే ఈ అన్నదానం కార్యక్రమం బుధవారం జయబాలాజి మండపంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వెంకటేశ పెరుమాళ్ సమేత పద్మావతి అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు స్నానాల గది, టాయిలెట్, తాగునీరు సౌకర్యం కల్పించినట్లు, ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

చదురగిరి ఆలయంలో భక్తుల రద్దీ


కొండ మార్గంలో ఆలయానికి వెళుతున్న భక్తులు

పెరంబూర్, అక్టోబరు 2: చదురగిరి సుందర మహాలింగం ఆలయంలో పురటాసి నెల మహాలయ అమావాస్య సందర్భంగా బుధవారం వేలాది మంది భక్తులు తరలివెళ్లారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ మేఘమలై పులుల శరణాలయం సాప్టూర్ అటవీ రేంజ్ పరిధిలో సముద్రమట్టానికి 3,500 ఎత్తున సంజీవిగిరి అనే చదురగిరి కొండలపై సుందర మహాలింగం ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి, ప్రదోషం రోజుల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకొని సుమారు 10వేల మంది కొండ ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 32 రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించారు.

ఆస్పత్రి నుంచి మంత్రి అన్బిల్ డిశ్చార్జి

అడయార్, అక్టోబరు 2: ఇటీవల ఉన్నట్టుండి అస్వస్థతకులోనై ఆస్పత్రిలో చికిత్స పందిన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖామంత్రి అన్బిల్ మహేష్ డిశ్చార్జ్ అయ్యారు. రాష్ట్ర విద్యా మంత్రిగా జిల్లాల వారీగా పాఠశాలను తనిఖీ చేస్తూ, పాఠశాలల్లో సౌకర్యాల మెరుగు కోసం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన కాంచీపురం జిల్లా ఉత్తరమేరూర్ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు పూర్తి చేసుకుని నగరానికి తిరిగివస్తుండగా, ఉన్నట్టుండి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో అంజికరైలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. చికిత్స తర్వాత ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో బుధవారం డిశ్చార్జ్ అయ్యారు.

మాదకద్రవ్యాల విక్రయం: దుకాణాల సీజ్

వేలూరు, అక్టోబరు 2: జిల్లా ఎస్పీ మదివానన్ ఉత్తర్వులతో పోలీసులు, ఆహార భద్రతా శాఖ అధికారులతో కలసి జిల్లా వ్యాప్తంగా దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో, గుడియాత్తం డివిజన్ డీఎస్పీ రామచంద్రన్ నేతృత్వంలో పేర్నాంబట్టు ఎస్ఐ సిలంబరసన్, ఆహార భద్రతా శాఖ అధికారులు పేర్నాంబట్టులో అనీస్ అహ్మద్‌కు చెందిన దుకాణంలో తనిఖీ చేసి హాన్స్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదుచేసి, రూ.25 వేల జరిమానాతో పాటు దుకాణానికి సీలు వేశారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

ప్యారీస్, అక్టోబరు 2: స్థానిక తిరువొత్తియూర్ కాలడి పేట ఉత్తర మాడవీధిలో ఉన్న అంకాళ పరమేశ్వరి ఆలయంలో ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీ బద్దలుకొట్టి కానుకలు దోచుకొని పరారయ్యారు. పురాతనమైన ఈ అలయానికి వచ్చే భక్తులు హుండీలో కానుకలు చెల్లించి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ఆలయంలో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీలో నగదు దోచుకొని బయటకు వెళుతున్న సమయంలో అడ్డుకోబోయిన భక్తులకు కత్తి చూపి బెదిరించి పరారయ్యారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన నిందితుల కోసం గాలిస్తున్నారు.

మత్తు మాత్రల విక్రయం: ఐదుగురి అరెస్టు

అడయార్, అక్టోబరు 2: నగర శివారు ప్రాంతమైన నెర్కుంద్రంలో మత్తు మాత్రలను విక్రయించిన ముగ్గురు విద్యార్థుల సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 49 మత్తు మాత్రలు, రూ.17,400 నగదు, అత్యంత ఖరీదైన బైకు, కత్తులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

లారీ బ్రేక్ ఫెయిల్: ఐదు కార్లకు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

ఐసిఎఫ్, అక్టోబరు 2: సేలం-కోవై జాతీయ రహదారిలో తొట్టంగుట్ట ప్రాంతంలో కంకర లోడుతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో కారును ఢీకొట్టగా, ఆ కారు ముందు వెళ్తున్న మరో నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. జాతీయ రహదారిలో వంతెన నిర్మాణపనులు జరుగుతుండడంతో వాహనాలు తక్కువ వేగంతో వెళుతున్నాయి. ఈ క్రమంలో, బుధవారం ఉదయం హఠాత్తుగా బ్రేక్ ఫెయిల్ అయిన లారీ ప్రమాదానికి కారణమైంది. ఈ ఘటనలో కోయంబత్తూర్‌లో పారా త్రోబాల్ పోటీలకు వెళ్లే అంతర్జాతీయ క్రీడాకారులు మనోజ్‌కుమార్, తమిళరసన్ సహా ఏడుగురు వెళ్తున్న కారు కూడా ప్రమాదానికి గురికాగా, వారికి స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన వాహనాల్లో వెళ్తున్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో సుమారు గంట పాటు వాహన రాకపోకలు నిలిచిపోగా, స్థానిక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జీవకారుణ్య సదస్సులో కసాయి పాల్గొన్న చందంగా ఉంది

● మాజీ మంత్రి జయకుమార్


గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జయకుమార్ తదితరులు

అడయార్, అక్టోబరు 2: డీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మద్యం, మాదకద్రవ్య నిర్మూలనా, మహిళా మహానాడులో డీఎంకేకు చెందిన ముఖ్య నేతలు పాల్గొనడం, జీవకారుణ్య సదస్సులో కసాయి పాల్గొన్న చందంగా ఉందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ ఎద్దేవా చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీ మండపంలో గాంధీ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వీసీకే ఆధ్వర్యంలో జరిగిన మద్యం నిషేధ మహానాడులో డీఎంకే నేతలు పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ యేడాది విస్తారంగా వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ హెచ్చరిస్తుందని, అందువల్ల ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఆ కార్డు ఎంటీసీ బస్సుల్లో చెల్లుతుంది

● రవాణా శాఖ వెల్లడి

అడయార్, అక్టోబరు 2: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కార్డుపై ఎంటీసీ బస్సుల్లో కూడా ప్రయాణం చేయొచ్చని రాష్ట్ర రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం చెన్నైనగరంలో నడిచే మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రయాణికులకు వివిధ రూపాల్లో టిక్కెట్లు ఇస్తున్నారు. దీంతో టిక్కెట్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు ఎక్కువ సమయం వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుండటంతో నేషనల్ కామన్ మొబిలిటీ కార్డును ప్రవేశపెట్టింది. ఈ కార్డుపై మెట్రో రైళ్లతో పాటు ఎంటీసీ బస్సుల్లో కూడా ప్రయాణం చేయొచ్చని రవాణా శాఖ అధికారులు వెల్లడించారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యాలయం ప్రారంభం


దివ్యాంగుడిని సత్కరిస్తున్న అనమలగుర్తి లాబాను, జయచంద్రన్

ప్యారీస్, అక్టోబరు 2: స్థానిక చూలైలో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) జిల్లా కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరావు ఉత్తర్వుల మేరకు సెంట్రల్ చెన్నై తూర్పు జిల్లా అధ్యక్షుడు అనమలగుర్తి లాబాను సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.జయచంద్రన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, కామరాజర్ చిత్రపటాలకు నివాళులర్పించి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు.

తమిళనాడు వెటర్నరీ వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా జగపతిరామయ్య


డాక్టర్ జగపతిరామయ్య

తిరుపతిరూరల్, అక్టోబరు2: తమిళనాడు వెటర్నరీ వర్సిటీ(తనువాస్) అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా తిరుపతికి చెందిన ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు. గతంలో ఏపీ వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా పనిచేసి రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు కీలక సలహాలు, సూచనలు అందించారు. అలాగే న్యాక్ కోఆర్డినేటర్‌గా పనిచేసి దేశంలోనే తొలిసారిగా తిరుపతి పశువైద్యవిద్య వర్సిటీకి న్యాక్ గుర్తింపు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) నోడల్ అధికారిగా, వెటర్నరీ కళాశాల ఏడీగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జగపతిరామయ్య మీడియాతో మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ రంగాలలో తమిళనాడు వెటర్నరీ వర్సిటీని అభివృద్ధి దిశగా నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఏటీఎం దోపిడీ ముఠాను బంధించడం పోలీసు శాఖకు గౌరవం

● డీజీపీ శంకర్ జివాల్


చికిత్స పొందుతున్న సీఐకి ఆర్థికసాయం అందజేస్తున్న డీజీపీ

పెరంబూర్, అక్టోబరు 2: ఏటీఎం దోపిడీ ముఠాను బంధించిన ఘటన నామక్కల్ జిల్లా పోలీసులకు మాత్రమే కాదని రాష్ట్ర పోలీసు శాఖకు గౌరవం చేకూర్చిందని డీజీపీ శంకర్ జివాల్ కొనియాడారు. గత శుక్రవారం కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో మూడు ఏటీఎంలు బద్దలుకొట్టి, రాష్ట్రం వైపు వచ్చిన హరియాణా రాష్ట్రానికి చెందిన దోపిడీ ముఠాను నామక్కల్ జిల్లా పోలీసులు వెంటాడి బంధించారు. ఈ ఘటనలో దోపిడీ ముఠాకు చెందిన జుమాదిన్ ఎన్‌కౌంటర్‌లో హతం కాగా, మహమ్మద్ హస్రుకు గాయాలుకాగా, ఐదుగురిని పోలీసులు బంధించారు. ముఠాను బంధించే సమయంలో కుమారపాళయం ఇన్‌స్పెక్టర్ తవమణి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌లకు గాయాలవడంతో నామక్కల్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో, బుధవారం నామక్కల్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన డీజీపీ శంకర్ జివాల్ చికిత్స పొందుతున్న సీఐ,ఎస్ఐలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఎస్.రాజేష్ కన్నన్ సహా ఏడీఎస్పీలు 23 మందికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

'అందనాల్'లో భయపెట్టనున్న ఆర్యన్ శ్యామ్



గ్రీన్ మ్యూజిక్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మితమైన 'అందనాల్' చిత్రంలో భయపెట్టే పాత్రలో యువ నటుడు ఆర్యన్ శ్యామ్ నటించారు. వచ్చే నెలలో విడుదల కానున్న ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాలకు ఎంపికై, పలు అవార్డులను కైవసం చేసుకుంది. ఈ సినిమా విడుదలకాకముందే ఆర్యన్ శ్యామ్‌కు వరుస చిత్రాల్లో నటించే అవకాశాలు కూడా వరిస్తున్నాయి. దీనిపై ఆర్యన్ శ్యామ్ మాట్లాడుతూ, "అందనాల్ సినిమాలో ఓ మంచి పాత్ర ఇచ్చిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. ఈ సినిమా రిలీజ్‌కు ముందే మరికొన్ని చిత్రాల్లో నటించే అవకాశాలు వస్తున్నాయి. అయితే, ప్రేక్షకుల మనసుల్లో గుర్తుండిపోయే పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ ముందుకుసాగాలన్న లక్ష్యంతో ఉన్నాను. 'అందనాల్' చిత్రానికి ముందు తిరుపతి వేంకటాచలపతి చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'బ్రహ్మాండ నాయగన్' అనే చిత్రంలో వేంకటేశ్వరస్వామి పాత్రలో నటించాను. దానికి పేరు, ప్రశంసలు వచ్చాయి. నా నటనకు మెచ్చి యూత్ సూపర్‌స్టార్ అనే బిరుదును కూడా ప్రేక్షకులు ప్రదానం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలో విజయవంతంగా స్ట్రీమింగ్ అవుతుంది. టీటీడీ అధికారులు కూడా చిత్రాన్ని చూసి అభినందించి, చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. అయితే, శ్రీవారి భక్తులు పరమపవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న విషయం ఎంతో బాధించింది. దీనికి కారకులైన వారిని గుర్తించి శిక్షించాలి' అని కోరారు.

ఎస్.జె.జననికి సీఎల్ఈఎఫ్ అవార్డులు

సంగీత దర్శకురాలు, సినీ నేపథ్యగాయనిగా గుర్తింపు పొందిన ఎస్.జె.జననికి సీఎల్ఈఎఫ్ మ్యూజిక్ అవార్డులు-2024లో పంట పడింది. ఆమె ఏకంగా ఆరు అవార్డులను సొంతం చేసుకున్నారు. తాజాగా ముంబై వేదికగా రేడియో అండ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో నాలుగో ఎడిషన్ సీఎల్ఈఎఫ్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఇందులో ఆమె సంగీతం సమకూర్చిన రైల్ చిత్రానికి ఏకంగా నాలుగు విభాగాల్లో అవార్డులు వరించాయి. మరో రెండు అవార్డులను భక్తిపాటల ఆల్బమ్‌కు గెలుచుకున్నారు. ఇందులో జననికి ఉత్తమ సంగీత దర్శకురాలు (రైల్), ఉత్తమ నేపథ్య గాయని (రైల్), ఉత్తమ సినీ గేయం (రైల్), బెస్ట్ మ్యూజిక్ అరేంజర్ (రైల్) కేటగిరీల్లో అవార్డులను అందుకున్నారు. అలాగే, 'శివనే శివనే ఓం' అనే డివోషనల్ ఆల్బమ్‌కు బెస్ట్ కంపోజర్, బెస్ట్ ఆల్బమ్ సాంగ్ విభాగాల్లో మరో రెండు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఒకే వేదికపై ఏకంగా ఆరు అవార్డులను గెలుచుకోవడం ఆ దేవుని దయ అని ఆమె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



అవార్డులతో జనని

'వేట్టయన్' ఎఫెక్ట్.... 4న పలు చిన్న చిత్రాల రిలీజ్

చిత్రజ్యోతి

ఈ నెల 4వ తేదీ మొదటి శుక్రవారం పలు చిన్న బడ్జెట్ చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. దీనికి కారణం 10వ తేదీ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్' భారీ స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రం హిట్ టాక్ సొంతం చేసుకుంటే ఆ తర్వాత శుక్రవారం కూడా తమ సినిమాలను రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సాహసం చేయకపోవచ్చు. అలాగే, దీపావళికి మరికొన్ని చిత్రాలకు విడుదలకానున్నాయి. దీంతో చిన్న బడ్జెట్ చిత్రాల విడుదలకు ఈ శుక్రవారమే సరైనదిగా దర్శక నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు భావించారు. ఫలితంగా ఐదారు చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. ఈ జాబితాలో 'అప్పు', 'అరకన్', 'చెల్లకుట్టి', 'నీల నిర సూరియన్', 'ఒరే పేచ్చు ఒరే ముడివు', 'సీరన్', 'వేట్టైకారి', 'ల్ తక సై ఆ' వంటి సినిమాలున్నాయి. ఈ చిత్రాలు మంచి కథాంశంతో ఉంటే ప్రేక్షకులు ఆదరించడం ఖాయం. ఇటీవల వచ్చిన 'లబ్బర్ పందు' మూవీ ఇందుకు ఉదాహరణ. గ్రామీణ క్రికెట్ క్రీడా నేపథ్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే 'ఈగో' అనే చిన్న పాయింట్‌తో తెరకెక్కించారు. ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో రూ.5 కోట్ల బడ్జెట్‌గాను రూ.20 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. దీంతో రేపు విడుదలయ్యే చిన్న చిత్రాలు ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటాయో వేచి చూడాల్సిందే.




'సీరన్'లో ఓ దృశ్యం



'ల్ తక సై ఆ' సద నాడార్, మోనిక

5 నుంచి 'వెనమ్ : ది లాస్ట్ డ్యాన్స్' సందడి



'వెనమ్' సిరీస్‌లో భాగంగా మూడోభాగంగా తెరకెక్కిన 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' సినిమా ఈ నెల 25న రిలీజ్ కానుంది. అయితే, భారతీయ సినీ ప్రేక్షకులకు కోసం చిత్రం ట్రైలర్ ముందుగానే దేశవ్యాప్తంగా దాదాపు 1500కుపైగా స్క్రీన్లలో ప్రదర్శిస్తున్నారు. స్పైడర్ మ్యాన్ కామిక్స్‌లో అత్యంత పాపులర్ విలన్లలో ఒకరైన వెనమ్ పాత్ర ఆధారంగా రూపొందిన 'వెనమ్' చిత్రం 2018లో విడుదలై, బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఔటర్ స్పేస్ నుంచి భూమిపైకి వస్తున్న సింబియోట్ అనే గ్రహాంతరవాసులలో వెనమ్ ఒకరు. ఈ చిత్రం రెండో భాగాన్ని 'వెనమ్: లెట్ దేర్ బీ కార్నేజ్' అనే పేరుతో తెరకెక్కించగా, 2021లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో మూడోది, చివరి భాగమైన 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' ఈ యేడాది ఆఖరులో విడుదలకానుంది. దానికంటే ముందుగానే ప్రేక్షకులను అబ్బురపరిచేందుకు ట్రైలర్ రిలీజ్ చేశారు. కెల్లీ మార్సెల్ దర్శకత్వంలో టామ్ హార్డీ నటించిన ఈ చిత్ర ట్రైలర్ ఇప్పటికే విడుదలై ట్రెండింగ్‌లో ఉంది. దీంతో 'వెనమ్' మూడో భాగంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి.

ఎయిర్ షోకు ముమ్మర ఏర్పాట్లు

● మెరీనాలో 8 వేల మంది పోలీసులతో భద్రత



పెరంబూర్, అక్టోబరు 2: భారత వైమానిక దళం 92 వార్షికోత్సవం సందర్భంగా మెరీనా తీరంలో ఈ నెల 6వ తేది (ఆదివారం) విమాన సాహస ప్రదర్శన జరుగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన చూసేందుకు లక్షలాది మంది వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. 2003లో నిర్వహించిన విమాన సాహస ప్రదర్శనకు లక్షలాది మంది ప్రజలు తరలి వచ్చారు. అలాగే, ఈ నెల 6న జరుగనున్న ప్రదర్శనను వీక్షించేందుకు భారీగా ప్రజలు వచ్చే అవకాశముందని భావించిన పోలీసు శాఖ ఆ ప్రాంతంలో అదనపు భద్రత ఏర్పాటుచేయనుంది. ఆ రోజు 8 వేల మంది పోలీసులతో బందోబస్తు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

సముద్ర స్నానాలకు నిషేధం...

ప్రదర్శన జరిగే రోజు ఆదివారం మెరీనాలో సముద్ర స్నానాలకు నిషేధం విధించారు. ఆదివారం ఉదయం నుంచే ప్రజలు వచ్చే అవకాశముంది. మెరీనా కామరాజర్ రోడ్డులో ఆ రోజు ఉదయం నుంచి వాహన రాకపోకలు ఆపి ప్రజలను మాత్రమే అనుమతించనున్నారు. రద్దీలో పిక్ ప్యాకెటింగ్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలు అడ్డుకొనేలా మఫ్టీలో పోలీసులు నిఘా చేపట్టనున్నారు. విమాన ప్రదర్శన నేపథ్యంలో మూడు రోజుల పాటు ట్రయల్ నిర్వహించనున్నారు. ఆ ప్రకారం, మంగళవారం నుంచి ప్రారంభమైన ప్రదర్శన రెండవ రోజైన బుధవారం కూడా జరిగింది. 4వ తేది ట్రయల్స్‌కు చివరి రోజు.











మంగళవారం రాత్రి చెన్నైలో జరిగిన 'ది మద్రాస్ వాలంటరీ బ్లడ్ బ్యూరో (ఎంవీబీబీ), 'ది అసోసియేషన్ ఆఫ్ వాలటరీ బ్లడ్ డోనర్స్ (ఏవీబీడీ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (టీఏంపీఏ) అధ్యక్షులు డాక్టర్ సీఎంకే రెడ్డి, లబ్ధిదారులకు అవార్డులు బహూకరిస్తున్న దృశ్యం

రజనీ కోలుకోవాలంటూ అభిమానుల పూజలు

పెరంబూర్, అక్టోబరు 2: సూపర్ స్టార్ రజనీకాంత్ అనారోగ్యం కారణంగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆయురారోగ్యంగా తిరిగి రావాలని కోరుతూ పలు రాజకీయపార్టీల నేతలు, సినీరంగానికి చెందిన వారు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, తూత్తుకుడి జిల్లా రజనీకాంత్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో బాగంప్రియాల్-శంకర్ రామేశ్వర ఆలయం, శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రజనీకాంత్ అభిమానుల సంఘం నిర్వాహకులు విజయ్ ఆనంద్, జయపాల్, కన్నన్, రమేష్ కార్తికేయన్ సహా అభిమానులు పాల్గొన్నారు.



పూజల్లో రజనీకాంత్ అభిమానులు

హీలియం బెలూన్‌లో ఎగిరిన చిన్న ఉపగ్రహం

పెరంబూర్, అక్టోబరు 2: 'చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థినీ, విద్యార్థులు, రూ.25,000 వ్యయంతో 500 గ్రాముల బరువున్న ఉపగ్రహాన్ని హీలియం బెలూన్ ద్వారా ఎగురవేశారు. తిరువణ్ణామలై జిల్లా క్రీడా మైదానంలో బుధవారం ఈ ప్రయోగం నిర్వహించారు. హీలియం బెలూన్ ద్వారా సుమారు 20 కి.మీ దూరం ఎగిరిన ఉపగ్రహం సుమారు మూడు గంటలు నిరంతరాయంగా భూమి చిత్రాలను పంపింది. అలాగే, గాలిలోని తేమ, పరిసర ఉష్ణోగ్రతను ఈ ఉపగ్రహం గుర్తించింది. తక్కువ ఖర్చుతో చేసిన చిన్న ఉపగ్రహాల ద్వారా వాతావరణం తెలుసుకొనే అవకాశముందని నిర్వాహకులు తెలిపారు.



ఉపగ్రహం కలిగిన బెలూన్‌ను వదులుతున్న విద్యార్థులు

సీటీఏ రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన



రక్తదానం చేస్తున్న సీటీఏ నిర్వాహకులు

చెన్నై, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలోని చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధురవాయల్‌లోని రవీనా హాస్పిటల్‌లో నిర్వహించిన వైద్య, రక్తదాన శిబిరాలకు అపూర్వస్పందన లభించింది. సీటీఏ నిర్వాహకులే కాకుండా స్థానిక ప్రముఖులు, ప్రజలు కూడా వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుని రక్తదానం చేశారు. సీటీఏ, రవీనా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నానగర్‌లోని చెన్నై బ్లడ్ సెంటర్ సహకారంతో ఉదయం 9 నుండి మధ్యాహ్నం వరకూ ఈ శిబిరాలు కొనసాగాయి. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా సీటీఏ అధ్యక్షుడు గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి సురేష్ మీడియాతో మాట్లాడుతూ... సుమారు వెయ్యి మంది సభ్యులు కలిగిన తమ సంస్థ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా ఉగాది, శ్రీరామనవమి వేడుకలు, కార్తీక వనభోజనాలు, వైద్య, రక్తదాన శిబిరాలు, తదితర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రతియేటా అక్టోబర్ 2 గాంధీ జయంతి లేదా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీటీఏ కార్యదర్శి గాడిపర్తి సురేష్, ఉపాధ్యక్షులు బీవీ నాయుడు, కోశాధికారి కె.నాగరాజు, కమిటీ సభ్యులు రామయ్య, శ్రీనుబాబు, సుధాకర్, రఘునాథరెడ్డి, రామ్‌ప్రసాద్, వీసీ కొండస్వామి నాయుడు, ఎం.కృష్ణ, మాజీ కార్యదర్శి పి.ఉమాపతి, మాజీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు కూడా పాల్గొన్నారు.

విద్యుత్ కార్ల తయారీలో ఫోర్డ్

ఐసిఎఫ్, అక్టోబరు 2: విద్యుత్ కార్లు తయారుచేయాలని ఫోర్డ్ సంస్థ నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి స్టాలిన్ తన అమెరికా పర్యటన సమయంలో అందించిన పిలుపుతో తమిళనాడు మళ్లీ కార్ల ఉత్పత్తి చేపట్టనున్నట్లు ఫోర్డ్ ప్రకటించిన విషయం తెలిసిందే. నగరం శివారు ప్రాంతమైన మరైమలై నగర్‌లో ఉన్న కర్మాగారంలో ఫోర్డ్ సంస్థ కార్ల ఉత్పత్తి ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, ఆ కర్మాగారంలో విద్యుత్ కార్ల తయారీకి ఆ సంస్థ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇప్పటికే టాటా, వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థలు రాష్ట్రంలో విద్యుత్ కార్ల తయారీ ప్రారంభించాయి. తాజాగా ఫోర్డ్ నిర్ణయంతో, విద్యుత్ కార్ల తయారీ హబ్‌గా తమిళనాడు మారనుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఎయిర్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో 'సద్భావన వాకథాన్'

పెరంబూర్, అక్టోబరు 2: స్థానిక ఆవడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ 92వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం 'సద్భావన వాకథాన్' నిర్వహించారు. పిల్లలు, మహిళలు, పురుషుల విభాగంలో 7 కి.మీ, 9 కి.మీ విభాగాల్లో నిర్వహించిన ఈ వాకథన్‌ను ఎయిర్ కమాండర్ పీఎస్ వైద్య ప్రారంభించారు. దేశ సమైక్యత కోసం త్యాగాలు చేస్తున్న సైనిక వీరులకు ఘనత చేకూర్చేలా ఈ వాకథాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వాకథాన్ పోటీ విజేతలకు ఏఎఫ్ ఎఫ్ డబ్ల్యూఏ ప్రెసిడెంట్ ఇంద్రాణి వైద్య బహుమతులు అందజేసి అభినందించారు.



వాకథాన్ ప్రారంభిస్తున్న కమాండర్ పీఎస్ వైద్య

పాంబన్ కొత్త వంతెనపై రోప్ బ్రిడ్జి ట్రయల్ రన్ విజయవంతం

పెరంబూర్, అక్టోబరు 2: రామేశ్వరం సమీపంలోని పాంబన్ కొత్త వంతెనపై రోప్ బ్రిడ్జి ట్రయల్ రన్ విజయవంతమైంది. ఈ కొత్త వంతెన మధ్యన 650 టన్నుల బరువున్న రోప్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జి పైకి వెళ్లడం, కిందకు రావడం కోసం వంతెన బరువుకు సమానంగా 300 టన్నుల ఉక్కు కడ్డీలను ఇరువైపులా అమర్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రైల్వే ఇంజనీర్లు కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేసి రోప్ బ్రిడ్జి లేపే హైడ్రాలిక్ యంత్రం ప్రారంభించారు. ఆ సమయంలో 2 అడుగుల ఎత్తు వరకే రోప్ బ్రిడ్జిని లేపారు. మళ్లీ సాయంత్రం 6 గంటలకు 15 మీటర్లు బ్రిడ్జి లేపి ట్రయల్ రన్ నిర్వహించారు. అలాగే, బుధవారం ఉదయం బ్రిడ్జి 22 మీటర్లకు లేపి మళ్లీ యథాస్థానంలో ఉంచారు. ఈ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు బాణాసంచా పేల్చి సంబరాలు జరిపారు. కొత్త రోప్ బ్రిడ్జి నౌకలు, బోట్లు వెళ్లే సమయంలో పైకి వెళ్లడం, అవి వెళ్లిన తర్వాత యథాస్థానానికి వస్తుందని అధికారులు తెలిపారు.



వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్యారీస్, అక్టోబరు 2: స్థానిక కొరుక్కుపేట చిగురింతపాలెం రెండో వీధిలోని కలి వెంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా జరిగింది.తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లోక కల్యాణార్థం 20వ వార్షిక అన్నదానం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణ ఘట్టంతో ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, గో పూజ, అంకురార్పణ అనంతరం అగ్ని ప్రతిష్ఠ సంకల్పపూజలను సీనియర్ పూజారి శంకర్ బృందం నిర్వహించింది. వేదమంత్రోచ్చరణ, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య దైవ కల్యాణం నిర్వహించారు. ఈ నెల 5వ తేది వరకు నిర్వహించనున్న శ్రీవారి ప్రత్యేక పూజల్లో చిగురింతపాలెం గ్రామస్తులు, తిరుమల పాదయాత్ర సభ్యులు, వెంకటేశ్వర భక్త బృందం సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో ఆర్కే నగర్ డీఎంకే ఎమ్మెల్యే జేజే ఎబినేజర్, కౌన్సిలర్ యు.గణేశన్, కేబీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణంలో ఎమ్మెల్యే ఎబినేజర్, కర్రా వెంకట సుబ్బయ్య తదితరులు

కామరాజర్‌కు నేతల ఘననివాళి

ప్యారీస్, అక్టోబరు 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 49వ స్మారక వర్ధంతిని పురస్కరించుకొని పలు రాజకీయ పార్టీల నేతలు బుధవారం ఘన నివాళులర్పించారు. గిండిలో ఉన్న కామరాజర్ స్మారక మందిరంలో రాష్ట్రప్రభుత్వం తరఫున మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబులు ఆయన సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, మాజీ ఎంపీ తిరునావుక్కరసర్, ఎమ్మెల్యే హసన్‌మౌలానా తదితరులు నివాళులర్పించారు. అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రులు సి.పొన్నయ్యన్, డి.జయకుమార్, పాండ్యరాజన్, మాజీ ఎంపీ జయవర్ధన్ తదితరులు నివాళులర్పించారు. బీజేపీ తరఫున కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర నిర్వాహకులు తమిళిసై సౌందర్‌రాజన్, కరు నాగరాజన్, కరాటే త్యాగరాజన్ తదితరులు అంజలి ఘటించారు. తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేశ్, మున్వర్‌భాషా, సైదై మనోహరన్, వీజీపీ గ్రూప్ చైర్మెన్ వీజీ సంతోషం, పెరుంతలైవర్ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎన్నార్ ధనపాలన్, సమత్తువ మక్కల్ కళగం అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణ్ తదితరులు కామరాజర్‌కు అంజలి ఘటించారు.







కామరాజర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి మురుగన్ తదితరులు - మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు తదితరుల నివాళి - టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, తిరునావుక్కరసర్ నివాళి